# మృగతృష్ణ

మౌనంగా కూర్చుని అన్నం తింటున్న కొడుకుని ఏదో ఒకటి పలకరించి మాట్లాడటానికి వెనుకాడింది శ్యామల. నిజానికి వాడంత పెద్దవయసు వాడుకాదు. పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగంలో ఉండి, పెద్దజీతం సంపాదిస్తున్న వాడూ కాదు. అయినా శ్యామలకి ఒక్కగానొక్క కొడుకు శ్రీరాం. వాడంటే ఆమెకి పంచ ప్రాణాలు. విపరీత గారం. అలవిగాని అనురాగం.

శ్రీరాంకి నాలుగేళ్ళన్నప్పుడు భర్తపోవడంతో, డబ్బుకి ఇబ్బంది లేకపోయినా వంటరిగా ఆ పిల్లాడ్ని పెంచుకుంటూ తనకి వాడు తప్ప ఎవరున్నారనే భావంతో జీవితం వెళ్ళదీస్తూ వచ్చింది. వాడు డిగ్రీలోకి వచ్చినప్పటి నుంచీ కొడుక్కి పెద్దరికం యిచ్చి గౌరవించటం మొదలు పెట్టింది.

శ్రీరాం చదువులో ఏమంత తెలివితేటలు చూపించిన వాడు కాదు. ఏదో అత్తెసరు మార్కులతో అన్ని క్లాసులూ ప్యాసవుతూ వచ్చాడు. కానీ డిగ్రీలో నిలబడి పోయాడు. ఎలాగైన బి.కాం. అయిందనిపిస్తే చాలు అనుకుంటూంటే అది అవడం లేదు – చదువు అయిందనిపించి ఉద్యోగంలో చేరి తల్లిని పోషించవలసిన అవసరం, బెంగ అతనికి లేవు. కానీ ఈ అసంపూర్ణ డిగ్రీ అతనికి చిరాకుగా ఉంది – చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు. అదేమంటే పరీక్ష ప్యాసవడం పక్కనపెట్టి తన ఫ్యూచర్ ప్లాన్ తను చేసుకుందా మని–

"అమ్మా! నేను సినిమాల్లో చేరిపోదామనుకుంటున్నా" అన్నాడు.

ఒక్కసారి శ్యామల ఉలిక్కిపడింది. అంతలోనే తేరుకుని కొడుకుని తేరిపార చూసింది. అతని కళ్ళు, ముక్కు, చెంపలు, జుత్తు.

"ఏం చేస్తావ్, సినిమాల్లో?" అంది. ఆమె గొంతులో కోపం, నీరసం లాంటివేమీ లేవు.

"నటిస్తాను" అన్నాడు. అతని కంఠంలో ధీమా వ్యక్తం అయ్యింది.

శ్యామల కళ్ళముందు అక్కినేని నాగేశ్వరరావు మొదలు అల్లు అర్జున్ వరకు నటులందరూ సినిమా రీలులా తిరిగి పోయారు. చివరగా వాళ్ళ కోవలో తన కొడుకు శ్రీరాం కూడా చేరినట్టు ఆమెకు ఊహ కలిగి హృదయం పులకించిపోయింది.

శ్యామలకి పెద్దగా చదువు లేదు. ఏదో వారపత్రిక చదవడం, తప్పుల్లేకుండా బట్టల పద్దు రాయడం, కిరాణా లిస్టురాయడం వరకూ ఆమె చదువు పరిమితం. అయితే సినిమాలు చూడ్డం మాత్రం ఎనిమిదేళ్ళ వయసు నుంచీ మహాసరదా. సినిమా చూడ్డం అంటే కళ్ళు తెరకి అతికించడమే – పక్కన బాంబులు పడినా తెలియనంత ఏకాగ్రత. సినిమా నించీ వచ్చాక చూసింది చూసినట్టు చెప్పటం మహాయిష్టం. ప్రతీరోజూ పిల్లవాణ్ణి స్కూలుకి పంపిచేసి పదకొండు గంటలాటకి ఏదో ఒక సినిమాకి వెళ్ళిపోయేది. సాయంత్రం పిల్లాడు వచ్చేలోపు ఇంటికొచ్చేసి వాడికి కావలసిన తిండీ తిప్పలు చూసి మంచం ఎక్కి హాయిగా రెండు గంటలు నిద్రపోయేది. సాధారణంగా ఇదే ఆమె దినచర్య. సినిమా గురించి ఏమీ సీరియస్‌గా తెలియకపోయినా సినిమా అంటే మాత్రం శ్యామలకి మహాసరదా.

"మరి నటించడం నేర్చుకోవాలిగా?" అంది అమాయకంగా.

"నటన ఎక్కడా నేర్చుకోరు. అది పుట్టుకతో రావాలి. నాకా టేలెంట్ ఉంది" అన్నాడు గర్వగా.

"అవున్లే! బొత్తిగా ఈ పరీక్ష కూడా ప్యాసవ్వలేక పోతున్నావు" అంది.

"గొప్పగొప్ప ఆర్టిస్టులెవ్వరూ ఈ పరీక్షలు ప్యాసవ్వటాలు పెట్టుకోలేదు. అది వేరు" అన్నాడు.

శ్యామల మరేమీ మాట్లాడలేదు. శ్రీరాం ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయి పోయాడు. ఎంత కాదనుకున్నా తల్లి తనని చదువు సాగించమని సతాయిస్తుందను కున్నాడు. కానీ ఆమె వెంటనే ఆనందంగా ఒప్పుకోవడంతోమనసులో ఉన్న చిన్న బెంగా ఉష్మని ఎగిరిపోయింది.

మర్నాటి నించీ శ్రీరాం వేషం, నడక, మాట, పలుకు, చూపులన్నీ మారి పోయాయి. ఒక బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి ఫేషియల్ చేయించుకున్నాడు. మీసం మీద

మీదింత శ్రద్ధ చూపించాడు. ఉన్న ప్యాంట్లూ, షర్టులు తీసి అవతల పారేసి ఫ్యాషనబుల్ డ్రస్సులు ఓ నాలుగు జతలు కొని తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో హంగులు ఏర్పరుచుకున్నాడు. సినిమా స్టార్ కాదలుచుకున్నవాడు ఎలా ఉండాలో ఊహించుకుని ఆ ప్రయత్నంలో పడిపోయాడు. అయితే ఎక్కువ సమయం అద్దం ముందే గడపాల్సి వస్తోంది. చూడగా చూడగా శ్రీరాం తనకి తానే అందంగా కనిపిస్తున్నాడు. చిత్రమేమంటే శ్యామలకి కూడా కొడుకు చక్కని వాడుగా కనిపిస్తున్నాడు.

'టేలెంట్ హట్' అనే రెస్టారెంట్‌లో ఫ్రెండ్స్ చేరడంతో శ్రీరాం ప్రయత్నాలు మొదలయ్యాయి. చిన్నప్పటి ఎలిమెంటరీ స్కూల్ మేట్స్ ఒకరిద్దరు ఇదే ప్రయత్నంలో ఉన్నారని వాళ్ళూ అక్కడికే వస్తారని తెలిసి వెళ్ళాడు. నిజంగానే అక్కడ అశోక్, మహర్షి కలిశారు. శ్రీరాంని చూసి వాళ్ళు ఆనందపడ్డారు. తమ అదృష్టాన్ని పరీక్షించు కోడానికి ఇదే సమయం, ప్లేసు అని వారు సంబరపడ్డారు.

" ఏరా, శ్రీరాం! నువ్వు గ్రాడ్యుయేషన్ చేశావా?" అన్నాడు అశోక్.,

"అబ్బే! చదువు మన ఒంటికి పడదని అర్థమయ్యింది! ఒదిలేశా!" అన్నాడు కాళ్ళూపుతూ.

మహర్షి గట్టిగా నవ్వుతూ "నువ్వింకా అంతదాకా అయినా వచ్చావ్. నేను ఇంటర్ దాటలేదు" అన్నాడు.

"ఒక టైపు మైండున్న వాళ్ళకి ఈ పరీక్షలు సరిపడవు" అన్నాడు శ్రీరాం సీరియస్‌గా.

"ఏంట్రా, ఇంకా ఏం లేకుండానే అంతపోజు" అన్నాడు అశోక్.

"గర్వం, ఫోజు అనుకుంటారు గానీ, ఇది ఆత్మవిశ్వాసం" అన్నాడు.

"ముగ్గురూ రకరకాల సినిమా కబుర్లు చెప్పుకోవడంలో పడ్డారు. ఏ నటుడు ఎలా ఉంటాడు? ఏ సినిమాలో ఏమైంది? ఏ సినిమా ఎందుకు హిట్టయింది? అసలు సినిమా హిట్టై కోట్ల వర్షం కురవాలంటే ఏం చేయాలి? కథ ఎలా ఉండాలి? ఎలాంటి మసాలా అందులో పెట్టాలి? అంటూ గంటలకొద్దీ డిస్కస్ చేసి ఇళ్ళకి చేరడం మామూలైంది. అదేవిధంగా శ్రీరాం గడిపేస్తున్నాడు. ఆ రోజు ఇంటికి అర్ధరాత్రి చేరేసరికి తలుపు తీసిన తల్లి నెమ్మదిగా "అచ్చు మావయ్య వచ్చాడు" అంది. ఆమె గొంతులోకొంచెం భయం, బెరుకూ వినిపించాయి.కానీ, శ్రీరాం అదేం పట్టించుకోలేదు. మరేం సమాధానం చెప్పకుండా అన్నం తినేసేసి తన దారిని తాను పోయి పడు కున్నాడు.

తెల్లారి లేస్తుంటేనే మావయ్య పేపర్ తిరగేస్తూ కనిపించాడు.

"ఏరా రాముడూ, ఈసారైనా పరీక్ష గట్టెక్కిస్తావా" అన్నాడు.

సూటిగా మావయ్య అడిగిన ప్రశ్నకి శ్రీరాం వెంటనే జవాబు చెప్పలేక పోయాడు. ఇంతలో తల్లి కాఫీ ఇస్తూ చూసింది. శ్రీరాం కాస్త ధైర్యం తెచ్చుకున్నాడు.

"ఏమిటో మావయ్యా! నాకీ పరీక్ష అయ్యేట్టు కనిపించటం లేదు" అన్నాడు నెమ్మదిగా.

అచ్యుతరావు పేపరు పక్కన పడేసి "అదేవిట్రా నా వల్ల కాదు అంటూ సగంలో వదిలేస్తే, చదువు అయ్యేదెలా? డిగ్రీ వచ్చేదెలా?" అన్నాడు.

శ్రీరాం మాట్లాడలేదు.

"ఏదో ఒక జాబ్‌లో చేరాలి కదా"

"ఇప్పుడు నా సంపాదనకంత తొందరేముంది? బానే ఉన్నాంగా"

"అంటే, ఎంతవరకు ఉన్నదాంట్లో వుడకేసుకు తినడమేనా! సొంతంగా నాలుగు రాళ్ళు సంపాయించి ప్రయోజకుడివి కావద్దా"

"డబ్బు సంపాయించడానికి చదువుకుని ఉద్యోగమే చెయ్యాలా" అన్నాడు.

ఆ మాటల్లో మేనల్లుడు చూపించిన నిర్లక్ష్యం, దిలాసా అచ్యుతరావుని ఆశ్చర్యపరిచాయి.

"ఏమిట్రా నీ ఆలోచన? ఏం చెయ్యాలన్నా - పోనీ వ్యాపారం ఏదైనా చెయ్యాలన్నా కనీసం డిగ్రీ లేకుండా ఎలా - పిచ్చి పిచ్చి ఆలోచనల్ని మాని, జాగ్రత్తగా పరీక్షలు రాయి".

మావయ్య మాటల్లోని కరుకుతనం శ్రీరాంకి వెంటనే అర్థమైంది. అంతలోనే అతనిలోకి ఒక మొండి ధైర్యం పుట్టుకొచ్చింది. తన అభిప్రాయం తనది. తన జీవితం తనది. తన యిష్టాలు తనవి. తనేం చెయ్యబోతున్నాడో చెప్పడానికి భయపడాల్సిన పనేముంది?

"నేనింక చదువుకోదల్చుకోలేదు" అంటూ చిన్నప్పటి దేవదాసులా స్థయిలుగా చెప్పాడు.

మేనమామకి అరికాలి మంట నెత్తికెక్కింది. సర్రున కోపమొచ్చింది.

"మరేం చేస్తావు?" అన్నాడు.

"సినిమాల్లో ట్రై చేద్దామనుకుంటున్నాను" అన్నాడు వెంటనే.

"ఏం చేస్తావు సినిమాల్లో?" అన్నాడు.

"నటుడిగా ట్రై చేస్తాను" అన్నాడు.

"నీ ముఖం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా?" అన్నాడు కోపంగా.

ఈ మాటలకి శ్రీరాంకి ఎంతవరకు పౌరుషమొచ్చిందో తెలీదుగానీ, శ్యామలకి మాత్రం చాలా ఉక్రోషం వచ్చింది. తన కొడుకుని అన్నయ్య అంత మాటనడం ఆమె సహించలేకపోయింది. అందుకే వెంటనే కల్పించుకుంది.

"అదేవిటన్నయ్యా అలా అంటావు? ఎవడదృష్టం ఎలా ఉందో ఎవరు చూడొచ్చారు" అంది నిష్ఠూరంగా.

"ఓహో! అయితే ఇందులో నీ ప్రోత్సాహం కూడా ఉందన్నమాట".

"నువ్వలా మాట్లాడితే నేనేం చెప్పను" అంది.

ఒక్క క్షణం అతనేం మాట్లాడలేదు. ఎవ్వరూ ఏం చెప్పకుండా కొంత సమయం నిశ్శబ్దంగా గడిచిపోయింది.

శ్రీరాం చిన్నప్పట్నించీ కష్టం తెలీకుండా పెరిగాడు. ఎవర్నీ ఏమీ చెయ్యిచాచి అడిగి ఎరుగడు. మనసులో మాట మనసులో ఉండగానే తల్లి అన్నీ సమకూరుస్తూ వచ్చింది. ఇవన్నీ అచ్యుతరావుకి తెలుసు. అందుకే నెమ్మదిగా శ్రీరాంకి అర్థమయ్యే విధంగా చెప్పాలనుకున్నాడు.

"స్టూడియోల వెంట తిరిగితే ఛాన్సులు వస్తాయనుకుంటున్నావా? నీకు థియేటరు అనుభవమేమైనా ఉందా? నాటకాలు వేసే అలవాటుందా? డైలాగులు చెప్పటం వచ్చునా? అసలు భాష. అదే తెలుగు చక్కగా మాట్లాడగలవా? పోనీ... కండలు పెంచిన అరడుగుల పర్సనాలిటీ ఉందా?".

మావయ్య ప్రశ్నలకి ఒక్కదానికి శ్రీరాం సమాధానం చెప్పలేకపోయాడు. మళ్ళీ శ్యామల కల్పించుకుని.

"అదేవిటన్నయ్యా చిన్నాణ్ణి పట్టుకుని అంతంత లేసి మాటలడిగితే వాడేం చెప్పగలడు" అంది.

"నువ్వు కాస్త మాట్లాడకుండా ఉంటావా" అన్నాడు కటువుగా.

శ్యామల జంకింది. "చెప్పరా చెప్పు! సినిమా అనేది అంత చవకబారు ప్రొఫెషనైపోయిందా? ఎన్ని హంగులుండాలి? నీ తండ్రులో, తాతలో, మావయ్యలో, బాబాయిలో ఫీల్డ్‌లో పాతుకుపోయి సపోర్ట్ ఇవ్వగల స్తోమతలో ఉండాలి. ఉన్నారా?"

"అలా ఎవరూ లేని వాళ్ళకి, కొత్తవాళ్ళకి కూడా ఛాన్సులొస్తూ ఉన్నాయి" అన్నాడు శ్రీరాం నెమ్మదిగా.

"సరే! ఎంతవరకూ రిస్కు చేయగలవు?"

"ఎంత వరకంటే, నాకు ఛాన్సు వచ్చేవరకు".

నిశితంగా మేనల్లుడి వైపు చూస్తుండిపోయాడు అచ్యుతరావు. ఐదడుగుల నాలుగంగుళాల హైట్‌తో ఏమంత చక్కని రూపం లేని శ్రీరాం సినిమా హీరో అవుదామని ఎలా అనుకుంటున్నాడా అనే ఆలోచనలో పడ్డాడు అచ్యుతరావు. నెమ్మదిగా అతన్ని హర్ట్ చేయకుండా అన్నీ వివరంగా చెప్పి చూశాడు.

"ఆ... దానిదేముంది మావయ్యా! ఇప్పుడున్న హీరోలందరూ అందగాళ్ళా? ఎంత అగ్లీగా ఉంటే అంత గ్లామర్" అన్నాడు.

అందగాళ్ళు కాకపోయినా ఏదో చమక్ ఉండాలిగా – మొదటిసారి, రెండోసారి ఫెయిలయినా మళ్ళీ మళ్ళీ వారిని పెట్టి సినిమాలు తీసి, ప్రమోట్ చేసే సొంత నిర్మాతలుండాలి. లేకపోతే ఎవర్నీ లెక్కచెయ్యకుండా తన సొంత ప్రతిభ మీద నిలబడగలిగే శక్తయినా ఉండాలి – ఎంత ఆలోచించినా శ్రీరాం విషయం అయోమయంగా అనిపించింది అచ్యుతరావుకి.

శ్రీరాం ఇప్పుడెవరేం చెప్పినా వినిపించుకునే స్థితిలో లేడని అర్థమై, నిరాశ కలిగింది.

'నేనా మాత్రం నటన చెయ్యలేనా' అనే ఊహల్లో ఉన్నాడు శ్రీరాం.

"ఏమిటో అన్నయ్యా! వాడికేమో చదువు మీద అస్సలు ఇంట్రస్టు లేదు. ఇదేదో చేస్తానంటున్నాడు. ఉద్యోగం లాగా దీనికి ఒక డిగ్రీ అని, ఒక సర్టిఫికేట్ అనీ అవసరం లేదుట కదా! చెయ్యనీ చూద్దాం!" అన్న గారికి నచ్చ చెప్పే ధోరణిలో ఏమీ అర్హతలు చూపించనవసరం లేని వృత్తి సినిమా అని తేల్చింది శ్యామల.

"మావయ్యా నువ్వేం కంగారుపడకు ఇందులో ఒక ఛాన్సు వచ్చి, సూపర్‌హిట్ కొట్టాననుకో – కనుక వర్షమే – మరింక చూసుకోవాల్సిన పనిలేదు" అంటూ మావయ్యకి ధైర్యం చెప్పాడు శ్రీరాం.

"సూపర్ హిట్ కొట్టాలి కదా" అన్నాడు అచ్యుతరావు.

"అలా ఆలోచిస్తే ఎలా మావయ్యా! పోనీ ఒకటి చేస్తా – ఇందులో నాకు హీరోగా ఛాన్సు రావడం ఆలస్యమైతే డైరెక్టర్‌గా మారిపోతా – దాని కస్సలు ఢోకా లేదు" అన్నాడు.

ఆ మాటలు విని అచ్యుతరావు మరీ కంగారు పడిపోయాడు. పాపులారిటీ, గ్లామర్, కీర్తి, డబ్బు ఇవన్నీ యువతరాన్ని సినిమా వైపు బాగా ఆకర్షిస్తున్నాయి. 'మనీ' అనేది ఒక్కసారిగా చాలా ఎక్కువ వచ్చే వీలు సినిమాల్లో కనిపిస్తుంది. లక్ ఉంటే అతి త్వరలో కోటీశ్వరులు కావచ్చనే ఊహ ఉర్రూతలూగించి వేస్తోంది. అచ్చు మామయ్యని ఎక్కువగా బాధించిన విషయమేమిటంటే డైరెక్టర్ అనే వాడికి ఏమీ తెలియనక్కర్లేదు, చదువు, విజ్ఞానం, ఆలోచనా అవసరం లేనిది డైరెక్షన్ అని శ్రీరాం అనుకోవడమే.

అచ్యుతరావు వెళ్ళిపోతూ శ్యామలకి నయానా, భయానా అన్నీ చెప్పాడు.

"పర్లేదన్నయ్యా - నే చూసుకుంటా - వాడు అదృష్టజాతకుడు. కోట్లు గడించే డైరెక్టర్ అయినా అవ్వచ్చు" అంటూ పలువిధాలా ధైర్యం చెప్పి పంపింది శ్యామల.

అప్పట్నించీ శ్రీరాం తన ప్రయత్నాలు వేగంగా చేయడం మొదలు పెట్టాడు. ఎక్కడెక్కడి సినిమా వీడియోలు సంపాదించి చూడడం, తనకున్న నలుగురి ఫ్రెండ్సుతో డిస్కస్ చేయడం, అన్నింటిలోంచి కొన్ని పాయింట్లు తీసుకుని ఒక తడికలాంటి కథ అల్లడం - దాన్ని చెప్పుకుంటూ మురిసిపోతూ రెండు చేతులూ ఫ్రేంలా పెట్టి చూస్తూ మురిసిపోతూ కూర్చోడం జరిగిపోతోంది. స్టూడియోల చుట్టూ తిరిగి నటుడిగా ప్రయత్నాలు ఎన్ని చేసినా 'చూద్దాం' అనే వాళ్ళేగానీ చూపిన వాళ్ళు లేకుండా పోయారు.

రెండేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. రాత్రి ఇంటికొచ్చిన కొడుక్కి తలుపు తీసి " ఏమైనా అయిందా?" అని అడిగేది శ్యామల.

అతనేదో జవాబు చెప్తూ విసుక్కునేవాడు. "తొందరపడితే పనులు కావు" అంటూ ముగించేవాడు.

హీరో వెనకాల పరిగెట్టే పదిహేను మందిలో మూడో లైనులో నాలుగోవాడిగా శ్రీరాం షూటింగులో పాల్గొన్నాడు. దానికి మూడొందలొచ్చాయి. అయితే ఆ ఛాన్సుకోసం అతను ఖర్చుచేసిన అయిదు వందలు రహస్యం.

రెండో ఛాన్సులో రెండే రెండు డైలాగులున్న పాత్ర వచ్చింది. కానీ శ్రీరాం విపరీతంగా భయపడడంతోఅవి గుర్తించుకుని చెప్పలేక పోయాడు. తడపడిపోయాడు. దర్శకుడు భుజం తట్టి "నెక్స్ట్ టైం బెటర్ లక్" అంటూ సాగనంపాడు.

మళ్ళీ వచ్చినప్పుడు అచ్చు మావయ్య 'భాష బాగా నేర్చుకో - డైలాగులు కంఠతా పట్టడం నేర్చుకో" అంటూ సలహా ఇచ్చాడు.

"ఇప్పుడు సినిమాల్లో భాషేంటి మావయ్యా! ఇప్పుడేమన్నా పౌరాణికాలు తీస్తున్నారా? అందులోనే వేస్తున్నావా?" అన్నాడు.

శ్యామలకి కొడుకు విషయంలో బెంగ మొదలైంది. ముప్పై ఏళ్ళు దాటిపోతున్నా పెళ్ళి కాలేదు - ఇంటికి కోడలు రాలేదు. సరైన సంపాదన లేదని బంధువులలో ఎవరూ పిల్లనివ్వడానికి ఇష్టపడడం లేదు. ఏం చెయ్యాలో తోచడం లేదు.

సినిమా ఒక కళనీ, అందులో రాణించడానికి ఎంతో కొంత ప్రతిభ ఉండాలనీ, కృషి ఉండాలనీ, కళాత్మకమైన సినిమా మీడియంకి, సంగీతం, సాహిత్యం, నృత్యం, నటన లాంటి లలిత కళల పట్ల మంచి అవగాహన ఉండాలనీ శ్రీరాం ఎప్పుడూ ఆలోచించలేదు. సినిమా అంటే అదృష్టమని - అది ఛాన్సు రావడం వల్లనే సాధ్యమని అనుకుంటూ వస్తున్నాడు. అదృష్టముంటే సక్సెస్ వస్తుందని, లేకపోతే ఏమీ లేదనీ అతని ఉద్దేశ్యం.

శ్యామల మాత్రం తన కొడుకు ఏదో చేస్తాడనీ, తెలివైనవాడనీ, పైకి రాకపోవ డానికి వాడి గ్రహస్థితి బాగా లేకపోవడమేనని, జాతకం తిరగబడితే ఇక తిరుగుండదనీ నమ్ముతూ బతుకుతోంది. ఏదో రోజుకి దశ తిరగక మానదని అనుకుంటూ శాంతులు, పూజలు, హోమాలు - జపాలు చేయిస్తూ, దేవుడికి మొక్కులు, ముడుపులు కడుతూ కాలక్షేపం చేస్తోంది.

కాలం ఎవరి కోసమూ ఆగదు కనుక, అది పరిగెడుతూనే ఉంది. దాని వెంటబడి శ్రీరాం కూడా పరిగెడుతూనే ఉన్నాడు. మరి అతనికి వెనక్కి తిరిగి చూసే అవకాశం లేదు కదా! ముందుకే నడుస్తున్నాడు.

(రచన - ఆగస్టు 2008)